క్లుప్తంగా

నేడు విద్యుత్ కోతలు

కృష్ణగిరి: మండల పరిధిలోని లక్కసాగరం, కంబాలపాడు, అలాగే వెల్దుర్తి మండల పరిధిలోని వెల్దుర్తి, కలుగొట్ల, రామళ్లకోట, గోవర్ధనగిరి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉద యం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈలు మద్దిలేటి, రాఘవేంద్ర ప్రసాద్ వేర్వేరు ప్రకటనల్లో తెలియజేశారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యు త్ లైన్లు, మరమ్మతు పనులు జరుగుతున్న దృష్ట్యా సరఫరా నిలిపేయనున్నట్లు చెప్పారు. వ్యవసాయానికి సంబంధించి ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని తెలియజేశారు.

ఊరు వాకిలి ఏర్పాటు

తుగ్గలి: వైఎస్సార్‌సీపీ నాయకుడు మారెళ్ల యమ్మే రాజశేఖర రెడ్డి తల్లిదండ్రులు వెంకటరామిరెడ్డి, భాగ్యమ్మ, భార్య శ్యామలమ్మ జ్ఞాపకార్థం స్వగ్రామంలో ఊరువాకిలి నిర్మించారు. రూ.16 లక్షలకు పైగా ఖర్చు చేసి నిర్మిస్తున్న ఊరువాకిలి పనులు పూర్తయ్యాయి. త్వరలో పూజలు నిర్వహించి ప్రారంభించనున్నట్లు ఆయన చెప్పారు.

బీమా తక్షణ సాయం అందజేత

మద్దికెర: మండల కేంద్రంలోని హరిజన వీధిలో తాలూరు ఆంజనేయులు అనారోగ్యంతో మరణించడంతో వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మృతుడి భార్య తాలూరి ఎర్రమ్మకు రూ.10 వేల నగదును సర్పంచ్ సుహాసిని, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు శుక్రవారం అందజేశారు. మిగతా సొమ్ము త్వరలో నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని వారు తెలిపారు. ఐడీసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

వలస వెళుతూ మృత్యువాత


మద్దిలేటి (ఫైల్)

దేవనకొండ: వలస వెళ్తూ మార్గమధ్యలో గుండెపోటు రావడంతో బంటుపల్లి గ్రామానికి చెందిన మద్దిలేటి (45) మృతి చెందారు. బాధిత కుటుంబస భ్యులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం రాత్రి గ్రామం నుంచి తెలంగాణ రాష్ట్రంలో పనులు చేసేందుకు కుటుంబసభ్యులతో కలిసి వెళ్తుండగా మార్గమధ్యలో ఉన్నఫలంగా ఛాతిలో నొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలి మద్దిలేటి మృతిచెందాడు. ఇంటి నిర్మాణం కోసం దాదాపు రూ.20 లక్షలు అప్పులు చేశారని, కుటుంబ పోషణ కోసం వలస వెళ్లే క్రమంలో ఘటన చోటు చేసుకుంది. మృతుడికి భార్య హనుమంతమ్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

నష్టపోయిన రైతులందరికీ పరిహారం

గోనెగండ్ల: ఈ ఏడాది ఖరీఫ్ వర్షాభావ పరిస్థితుల కారణంగా 33 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, నష్టపోయిన రైతులందరికీ పరిహారం వర్తిస్తుందని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, ఏఓ హేమలత తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ఎంపీఈఓలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలానికి రూ.11.48 కోట్ల మేర నష్టపరిహారం కోసం ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. పంటనష్ట పరిహారం కోసం రైతులు తగిన ధ్రువపత్రాలు ఆధార్‌కార్డు, పొలం పాస్‌బుక్, బ్యాంక్ ఖాతా వివరాలు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బందికి ఈనెల 20వ తేదీ లోపు అందజేయాలని సూచించారు.

పన్నులు చెల్లించండి

గోనెగండ్ల: మేజర్ గ్రామ పంచాయతీ గోనెగండ్లలో ఇంటి, కొళాయి, షాపుల పన్నులు సకాలంలో చెల్లించాలని ఈఓఆర్డీ నాగేష్, ఈఓ సతీష్ కోరారు. స్థానిక గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 2023-24కు సంబంధించిన పన్నులు చెల్లించాలని ప్రజలకు సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయిలు చెల్లించాలని కోరారు. అనంతరం గోనెగండ్ల నుంచి పెద్దమరివీడుకు వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డుకు అడ్డంగా ఉన్న దిబ్బలు, ముళ్లకంపలను జేసీబీతో తొలగించారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

ఓటరుగా నమోదు చేసుకోండి

ఆలూరు: 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆలూరు తహసీల్దార్ రామాంజనేయులు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజాస్వామ్య దేశంలో తమకు నచ్చిన వారిని నాయకులుగా ఎన్నుకునే వెసులుబాటును రాజ్యాంగం ఓటు హక్కు ద్వారా కల్పించిందన్నారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. ఎలక్షన్ డీటీ గుండాలనాయక్, సీనియర్ అసిస్టెంట్ బసన్నగౌడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ఆస్పరి: ఆస్పరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న హిస్టరీ లెక్చరర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు శనివారంలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహులు తెలిపారు. పీజీలో 50 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని, ఆసక్తి గల వారు దరఖాస్తును కళాశాలలో ఇవ్వాలన్నారు. వివరాలకు 99851 97739 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి



నగరడోణలో వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం, సోషల్ మీడియా సమావేశ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి

చిప్పగిరి: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరడోణ గ్రామంలో పర్యటించారు. గ్రామంలో రూ.39 లక్షలతో నిర్మించిన సచివాలయంను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. సచివాలయానికి మంజూరయ్యే రూ.40 లక్షల నిధులను గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు వినియోగించుకోవాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలు విమర్శించడమే పనిగా పెట్టుకున్నాయని, టీడీపీ- జనసేన ఉమ్మడి మ్యానిఫెస్టో అంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు.రాష్ట్రంలోని అన్ని పార్టీలు ఏకమై వచ్చినా 2024లో మళ్లీ వైఎస్ జగనన్న ముఖ్యమంత్రి కావడం ఖాయమని స్పష్టం చేశారు. నాయకులు నారాయణ స్వామి, శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణ, జూటూరు హేమలత, మారయ్య, మల్లికార్జున, మల్లమ్మ, తహసీల్దారు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా పోస్టర్ల ఆవిష్కరణ

ఆలూరు: రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి, అందిస్తున్న పథకాలపై సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయాలని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. స్థానిక మంత్రి నివాసంలో శుక్రవారం.. జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఎం.ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన జరగబోయే సమావేశానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టాలన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యత్యాసంపై విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. రాష్ట్రానికి మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగాల్సిన ఆవశ్యకతను వివరించాలన్నారు. జిల్లా సోషల్ మీడియా కోకన్వీనర్ విజయ్, ఆనంద్, నవీన్, తదితరులు ఉన్నారు.

స్వరూపానందేంద్ర స్వామి జన్మదిన వేడుకలు


వృద్ధాశ్రమంలో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీదేవి

పత్తికొండటౌన్: విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి జన్మదిన వేడుకలను శుక్రవారం పత్తికొండలో తెర్నేకల్లు కొత్తకాపు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మాజీ ఎంపీపీ ఎస్. నాగరత్నమ్మ పాల్గొన్నారు. స్థానిక హోసూరు రోడ్డులోని వృద్ధాశ్రమంలో స్వామివారి చిత్రపటాన్ని ఉంచి వేడుకలు నిర్వహించారు. వృద్ధులకు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంగడు, గాంధీరెడ్డి, కేశవరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

అలాగే స్థానిక శారదా వృద్ధాశ్రమంలో పోచిమిరెడ్డి సేవాదళ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు అనిత, సేవాదళ్ సభ్యులు గణపతి, సావిత్రి, శీను పాల్గొన్నారు.

ఆలూరు/దేవనకొండ: వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలూరు, దేవనకొండ ప్రభుత్వ ఆసుపత్రుల్లో శుక్రవారం రోగులు, బాలింతలు, గర్భిణులకు పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. నాయకులు నామాలశ్రీనివాసులు, హనుమంతు, బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి జరిగి ఉంటే ఆదరించండి


నెల్లిబండలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దేవనకొండ: వైఎస్సార్‌సీపీ పాలనలో మంచి జరిగి ఉంటే మరోసారి ఓటు వేసి ఆశీర్వదించాలని పార్టీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, మండల జేసీఎస్ కన్వీనర్ రాజారెడ్డి గ్రామ ప్రజలను విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని నెల్లిబండ గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. వారు మాట్లాడుతూ.. సంక్షేమ పాలన సాగిస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని కోరారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సహకార రంగం బలోపేతానికి చర్యలు


టౌన్‌బ్యాంక్ ఆవరణలో పతాక ఆవిష్కరణలో పాల్గొన్న జిల్లా సహకార శాఖ అధికారి

ఎమ్మిగనూరుటౌన్: సహకార రంగం బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని జిల్లా సహకార శాఖ అధికారి రామాంజనేయులు పేర్కొన్నారు. సహకార వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక టౌన్‌బ్యాంక్ ఆవరణలో సహకార పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సహకార రంగాల్లో ఒకటైన టౌన్ బ్యాంక్ అభివృద్ధి బాటలో పయనించేలా పాలకవర్గం, సిబ్బంది సమిష్టి కృషితో పనిచేయాలని సూచించారు. రుణాల రికవరీ సక్రమంగా ఉంటే బ్యాంకు అభివృద్ధి చెందుతుందని సూచించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలన్నారు. డివిజనల్ సహకార శాఖ అధికారిణి రమాదేవి, బ్యాంకు సీఈఓ గంగాధర్, డైరెక్టర్లు సయ్యద్‌చాంద్, తట్టిబుడ్డప్ప, పల్లవిరాజశేఖర్, వడ్డెరంగన్న, రజాక్,శ్రీరామ్, మహనందయ్యశెట్టి, డివిజన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి


పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

పత్తికొండటౌన్: పిల్లలకు చిన్నప్పటి నుంచే పుస్తక పఠనం అలవాటు చేయాలని ఎంపీపీ నారాయణదాసు, ఎంపీడీఓ కవిత అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా 4వ రోజు శుక్రవారం స్థానిక శాఖాగ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంపీపీ, ఎంపీడీఓ పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. రానురాను పుస్తక పఠనం తగ్గిపోతోందన్నారు. టీవీలు, వీడియో గేమ్‌లు, కంప్యూటర్ల ముందు పిల్లలు, విద్యార్థులు ఎక్కువగా గడుపుతున్నారన్నారు. మారుతున్న కాలానుగుణంగా కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి అయినప్పటికీ, పుస్తక పఠనాన్ని మాత్రం మరువరాదన్నారు. పుస్తకాలు విజ్ఞా న బాండాగారాలు అన్నారు. చరిత్రకు సాక్ష్యాలు పుస్తకాలేనన్నారు. ఎంఈఓ మస్తాన్‌వలి, గ్రంథాలయాధికారి రాంకుమార్, ఉపాధ్యాయులు ఖాసీంసాహెబ్, లక్ష్మణరావు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి


షేడ్ నెట్‌లో పెంచుతున్న ఓజొల్లాను పరిశీలిస్తున్న కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ, ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ ఆధ్వర్యంలో 'సురక్షిత పురుగు మందుల వాడకం-చీడపీడల యాజమాన్యం'పై రైతులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లకు ఇబ్బందులు పడరాదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. రైతులు బాగుంటేనే దేశం, రాష్ట్రం బాగుంటుందని, రైతే దేశానికి వెన్నెముకన్నారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని, రసాయన ఎరువులు పిచికారీ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ మాట్లాడుతూ.. హెచ్ఐఎల్ లిమిటెడ్, కిసాన్ అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు రసాయన మందుల పిచికారీ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. పంటలను చీడపీడల నుంచి కాపాడుకోవటంతో పాటు రైతులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. మందులు పిచికారీ చేసే సమయంలో రక్షణ కోటు, చేతికి గ్లౌజులు, ముఖానికి మాస్క్ వాడాలని, మందు పిచికారీ తరువాత శుభ్రం చేసుకోవాలన్నారు. అలాగే పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. అసోషియేట్ డీన్, మహానంది వ్యవసాయ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ నాయక్, హిల్స్ కంపెనీల ప్రతినిధులు, కేవీకే శాస్త్రవేత్తలు రమేష్‌నాయక్, మహనందయ్య, రైతులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా బలోపేతంపై దృష్టి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేలా సమష్టిగా కృషి చేద్దామని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 21వ తేదీన జిల్లా కేంద్రంలోని సూరజ్‌గ్రాండ్‌లో నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశ కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీ బలోపేతానికి సోషల్ మీడియా కృషి చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, కో-కన్వీనర్ మధుశేఖర్, పట్టణ, మండలాల కన్వీనర్లు మన్సూర్‌బాష, రవికుమార్, షరీఫ్, ఆసిఫ్, కో-కన్వీనర్లు కళ్యాణ్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

అవి-ఇవి

సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు

మద్దికెర: మండల పరిధిలోని బురుజుల గ్రామంలో సచివాలయ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు జయభరత్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సుబ్బయ్య తెలిపారు. శుక్రవారం సీసీ రోడ్డు పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేయడంతో గ్రామంలోని వీధుల్లో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాఘవరెడ్డి ఇంటి వద్ద నుంచి శివాలయం వరకు, చౌడమ్మ దేవాలయం వీధి, బొడ్రాయి వద్ద, బీసీ కాలనీలో రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. అనిమిరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పనులను పర్యవేక్షించారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: బాల్య వివాహాలు అరికట్టాలని, ఎవరైనా ప్రోత్సహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మస్తాన్‌వలి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఉర్దూ హైస్కూల్‌లో హ్యూమన్ రైట్స్ కమిటీ ఆధ్వర్యంలో విద్యా హక్కు చట్టం, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు జరుగుతుంటే విద్యార్థినులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఉచిత నిర్బంధ విద్య చట్టం ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాల్లోపు పిల్లలు కచ్చితంగా విద్యనభ్యసించాలని సూచించారు. కమిటీ డివిజన్ అధ్యక్షుడు అజిత్‌కుమార్, హెచ్ఎం కోటప్ప పాల్గొన్నారు.

నేడు భూ పంపిణీ

కృష్ణగిరి: మండలంలో 58 మంది పేదలకు శనివారం పత్తికొండలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా భూ పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ రాజేశ్వరి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ భూ పంపిణీకి 70.65 ఎకరాలను సిద్ధం చేశామన్నారు. అలాగే 20 ఏళ్ల అనుభవం ఉన్న 82 మంది అసైన్డ్‌దారులకు కూడా 165.24 ఎకరాలను నిషేధిత జాబితా 22ఏ నుంచి తొలగించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. 2,787.49 ఎకరాల్లో అనుభవం ఉన్న 1,452 మంది సర్వీసు ఇనాందారులకు హక్కులు కల్పించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

బాలికల హైస్కూల్ తనిఖీ

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌ను కర్నూలు డిప్యూటీ ఈఓ సత్యనారాయణ ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం వార్షిక తనిఖీ నిర్వహించింది. తనిఖీ బృందం పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయుల బోధనపై మూల్యాంకనం చేశారు. ఉపాధ్యాయుల పనితీరును, విద్యార్థుల సామర్థ్యాలను గమనించి గ్రేడింగ్ చేశారు. పాఠశాల నిర్వహణ, ప్రణాళిక, రిజిష్టర్లు, నిధులు వినియోగం, కంప్యూటర్ శిక్షణ, డిజిటల్, వర్చువల్ క్లాస్‌రూంలను పరిశీంచారు. ఉపాధ్యాయులతో సమావేశమై మెరుగైన విద్య బోధనకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. డీడీ నిర్మలాదేవి ఆధ్వర్యంలో జరిగిన డ్రిల్, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో వివరాలు అందించండి

దేవనకొండ: ప్రభుత్వం దేవనకొండను కరువు మండలంగా ప్రకటించిందని, పంటలు సాగుచేసి నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టినట్లు ఏఓ సురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. మండలంలో 74 వేల ఎకరాల్లో 21 వేల మంది రైతులు పంటల నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రతి రైతు బ్యాంకు ఖాతా, పొలానికి సంబంధించిన వివరాలను ఆర్‌బీకేలలో అందజేయాలని సూచించారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం

ఆస్పరి: ఆస్పరి కేజీబీవీ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న పల్లవి అనే విద్యార్థిని యోగా పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికయ్యింది. కలకత్తాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు వెళ్లేందుకు ఆమెకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. విషయం తెలుసుకున్న తెర్నేకల్లు కొత్తకాపు మధుసూదన్‌రెడ్డి శుక్రవారం పాఠశాలకు వెళ్లి క్రీడాకారిణి పల్లవికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. క్రీడాకారిణిని ప్రోత్సహించినందుకు ప్రిన్సిపాల్ శారోన్ స్మైలీ, పీఈటీ రాజేశ్వరి, ఉపాధ్యాయినులు ధన్యవాదాలు తెలిపారు.

వినాయక మండపం నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న నిర్వాహకులు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సమీపంలో నిర్మిస్తున్న అభయాంజనేయస్వామి విగ్రహ ఆవరణలో వినాయక మండపం ఏర్పాటు చేసేందుకు శుక్రవారం భూమి పూజ చేశారు. దాతలు దండుగుల ఎల్లపుల్లయ్య, లక్ష్మీదేవిలతో ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణ వ్యవస్థాపకులు చెరుకులపాడు రామాంజనేయులు ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు చేశారు. తమ తల్లిదండ్రుల పేరిట మండపం ఏర్పాటు చేస్తున్నామని, దీన్ని తమ అదృష్టంగా భావిస్తున్నట్లు దాత ఎల్ల పుల్లయ్య పేర్కొన్నారు. అనంతరం దాతలను నిర్వాహకులు సన్మానించారు. శ్రీనివాసులు, మహేష్‌బాబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

మద్దికెర: జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని ఏఈ ఉమాకాంత్ అన్నారు. ఆయన శుక్రవారం మండలంలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. ఇంటి నిర్మాణ దశను బట్టి లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేస్తామన్నారు. కాలనీల్లో ప్రభుత్వం నీటి వసతి, విద్యుత్ సౌకర్యం తదితర సౌకర్యాలు కల్పిస్తోందని, లబ్ధిదారులు వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు.

విద్యుత్‌షాక్‌తో వంటమనిషికి స్వల్పగాయాలు

పత్తికొండటౌన్: పత్తికొండ పట్టణం చక్కరాళ్ల రోడ్డులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో శుక్రవారం వంటమనిషి ఈరమ్మకు ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగలడంతో స్వల్పగాయాలు అయ్యాయి. వంటచేసేందుకు ఎలక్ట్రిక్ కుక్కర్ వినియోగించే సమయంలో విద్యుత్ షాక్ తగలడంతో అస్వస్థతకు గురైన ఈరమ్మను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె కోలుకున్నారని, విద్యుత్ స్విచ్ బోర్డులలో మరమ్మతుల కోసం ఎలక్ట్రీషియన్‌కు సమాచారం ఇచ్చామని ప్రిన్సిపాల్ ఉమారాణి తెలిపారు.

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేద్దాం

కృష్ణగిరి: పత్తికొండలో శనివారం జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేద్దామని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన కృష్ణగిరిలో జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణి, పార్టీ మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సామాజిక న్యాయానికి ప్రతీక సీఎం వైఎస్ జగనన్న అన్నారు. ఎన్నికలకు ముందుగా ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. రాష్ట్ర మంత్రులు నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మద్దికెర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న సుపరిపాలన, సంక్షేమ పథకాల గురించి వివరించేందుకు రాష్ట్ర మంత్రులు చేపట్టిన సామాజిక సాధికార యాత్ర శనివారం పత్తికొండలో నిర్వహించడం జరుగుతుందని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, మండల కన్వీనర్ గంపల వెంకటేశులు, పత్తికొండ మార్కెట్‌యార్డు చైర్మన్ పక్కీరప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం వారు మాట్లాడుతూ పత్తికొండలో ఉదయం 9 గంటలకు యాత్ర ప్రారంభమవుతుందని, మండలంలోని ఆయా గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆలూరు రూరల్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవని వైద్యారోగ్య సిబ్బంది అన్నారు. శుక్రవారం అన్ని సచివాలయాల పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు.

సజావుగా మండల సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంథోనీ

హాలహర్వి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ఎంపీపీ నెట్టికంటమ్మ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చూడాలని అధికారులకు సూచించారు. కాగా తాగునీటి సమస్యను పరిష్కరించాలని జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప, మురుగు కాలువలో పూడిక తీయించాలని, దుర్గమ్మ ఆలయం వద్ద రోడ్డు మధ్యన కరెంట్ స్తంభం తొలగించాలని ఎంపీటీసీ గంగమ్మ సభ దృష్టికి తెచ్చారు. ఎంపీడీఓ ఆంథోనీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నాగేష్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

హొళగుంద: మండల పరిధిలోని ఇంగళదహాళ్ గ్రామంలో శుక్రవారం దేవరగట్టు ఆలయ మాజీ చైర్మన్ కేసీ తిమ్మారెడ్డి జయంతి ఆయన వారసులు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. కర్నూలు ఓమిని హాస్పిటల్ వైద్యులు హాజరై దాదాపు 300 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, బీసీ హాస్టల్ వార్డెన్ శివుడు, నిర్వాహకులు రాజేశ్వర్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఎమ్మిగనూరుటౌన్: గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం వెణిగండ్లలో గురువారం నుంచి జరిగే రాష్ట్రస్థాయి 14 సంవత్సరాల్లోపు సాఫ్ట్‌బాల్ పోటీలకు స్థానిక ఎంఎస్ బాలికల జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని కీర్తన ఎంపికైంది. అదేవిధంగా 14సంవత్సరాల్లోపు విభాగంలో కర్నూలులో జరిగే రగ్బీ పోటీలకు ఎం.దక్షిత ఎంపికైనట్లు హెచ్ఎం కృష్ణమూర్తి శుక్రవారం తెలిపారు. క్రీడాకారిణులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్లు సుజనకుమారి, నాగేశ్వరిలను అభినందించారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని కటారుకొండ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం గోవిందురెడ్డి తెలిపారు. నంద్యాల ఎస్‌పీజీ స్కూల్‌లో జరిగిన అండర్-14 కబడ్డీ పోటీలో ప్రతిభ కనబరిచిన విజయ్‌కుమార్, సంజామల ఖోఖో క్యాంపులో ప్రతిభ చూపిన వైష్ణవి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 19 నుంచి 21వ తదీ వరకు చిత్తూరు జిల్లా బంగారుపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో వైష్ణవి, అలాగే ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు అన్నమయ్య జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విజయకుమార్ పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులు, శిక్షణ ఇచ్చిన పీఈటీ రంగస్వామిని అభినందించారు.